క్లుప్తంగా

రేపు పిడుగురాళ్ల కౌన్సిల్ సమావేశం

పిడుగురాళ్ల: మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని శనివారం ఉదయం 11 గంటలకు కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు తెలిపారు. కౌన్సిల్ సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

13న పిడుగురాళ్ల కోర్టులో లోక్ అదాలత్



పిడుగురాళ్ల: స్థానిక కోర్టులో సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, న్యాయమూర్తి టి. ప్రవల్లిక తెలిపారు. పట్టణంలోని కోర్టులో గురువారం ఆమె న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోర్టు పరిధిలోని కక్షిదారులంతా లోక్ అదాలత్‌లో క్రిమినల్, కేసులు, సివిల్, చెక్ బౌన్స్, ఎక్సైజ్, కుటుంబ తగాదాలు, ప్రీ లిటిగేషన్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని ఆమె తెలిపారు. ఈ దశగా కక్షిదారులకు న్యాయవాదులు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె. కుమారస్వామి, న్యాయవాదులు, బ్యాంకు ప్యానెల్ న్యాయవాదులు, పిడుగురాళ్ల, మాచవరం పోలీసులు, శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లతో సామాన్యుడిపై పెను భారం

దాచేపల్లి : సామాన్యుడిపై పెను భారం పడనున్న స్మార్ట్ మీటర్ విధానాన్ని తొలగించాలని సీపీఐ పల్నాడు సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్ డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా బషీర్‌బాగ్‌లో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై కాల్పుల మారణ హోమం జరిగి నేటికీ 25 సంవత్సరాలు అయిన సందర్భంగా దాచేపల్లిలోని సీపీఐ అమరవీరుల స్థూపం వద్ద గురువారం కార్యక్రమం నిర్వహించారు. అమరవీరులకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్ మాట్లాడుతూ మారణ హోమం తర్వాత వచ్చిన ప్రభుత్వాలు కరెంట్ చార్జీలు పెంచటమే తప్పా తగ్గించలేదని తెలిపారు. స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, ప్రస్తుతం పెంచిన కరెంటు చార్జీలను వెంటనే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై రూ. 15 వేల కోట్ల భారం పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ దాచేపల్లి మండల కార్యదర్శి కోమెర వెంకట్రావు, గురజాల నియోజకవర్గం ఏరియా కార్యదర్శి మందపాటి రమణారెడ్డి, ఏఐటీయూసీ నాయకులు వేముల వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు తెలనాకుల సత్యనారాయణ, బుర్రా కృష్ణారెడ్డి, కేసానపల్లి శాఖ కార్యదర్శి ఆనంద్ కుమార్, ప్రత్తిపాటి రోశయ్య కాలనీ కార్యదర్శి రామయ్య, మురికిపూడి సర్వయ్య, రాజశేఖర్, నాసరయ్య, ఎస్. కొండలు పాల్గొన్నారు.

ముక్త్యాల రాజాకు ఘన నివాళి

విజయపురి సౌత్: ముక్త్యాల రాజా 53వ వర్ధంతిని విజయపురిసౌత్ లోని పార్క్ సెంటర్‌లో కేసీపీ సిమెంట్ ఫ్యాక్టరీ ఉద్యోగుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ముక్త్యాల రాజా విగ్రహానికి సంస్థ సీనియర్ జనరల్ మేనేజర్ వి.వెంకటరమణ నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి మూల పురుషుడు ముక్త్యాల రాజా అని కొనియాడారు. ఆనాడు బంజరు భూములుగా ఉన్న పొలాలు నేడు సిరులు పండించే భూములుగా మారటానికి ఆయన చేసిన విశేష కృషేనని తెలిపారు. సర్ ఆర్థర్ కాటన్ చెప్పినట్లు నీరు ద్రవ రూపంలో ఉన్న బంగారం అనే సూక్తిని బలంగా నమ్మిన వ్యక్తి ముక్త్యాలరాజా అని వివరించారు. సొంత నిధులను వెచ్చించి ఖోస్లా కమిటీకి సాగర్ డ్యాం ప్లాన్ ,అడవిలో రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేసి ప్రాజెక్టు నిర్మాణానికి మార్గం సుగమం చేశారని తెలిపారు. కార్యక్రమంలో కేసీపీ హెచ్‌వోడీలు, యూనియన్ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మురుగు కాలువలో పడి వ్యక్తి మృతి



రెంటచింతల: స్థానిక బాలవికాస్ హైస్కూల్ సమీపంలోని చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్ద మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో ఓ వ్యక్తి మురుగు కాలువలో పడి మృతి చెందాడు. గ్రామంలోని ఆరోగ్యపురం కాలనీకి చెందిన చట్టా సాగర్ రాజు(40) తాపీ మేస్త్రిగా పని చేస్తాడు. ఇంటికి వెళుతూ దేవస్థానం మురుగు కాలువ గట్టుపై కూర్చుని అదుపు తప్పి దానిలో పడిపోవడంతో ఊపిరి ఆడక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పంచనామా నిమిత్తం గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సీహెచ్. నాగార్జున తెలిపారు.

మహో గణపతిం.. మనసాస్మరామి !

- ఘనంగా వినాయక చవితి వేడుకలు
- గణపయ్యకు భక్తిశ్రద్ధలతో పూజలు
- సందడిగా నిమజ్జనాలు



విజయపురిసౌత్ డౌన్ మార్కెట్‌లో గణేషుని విగ్రహం వద్ద పూజలు



విజయపురిసౌత్ సీ టైపులో నిమజ్జనం చేసేందుకు వెళ్తున్న భక్తులు



గుండ్లపాడులోని పోలేరమ్మ వీధిలో ఏర్పాటు చేసిన గణనాథుడు



సత్రశాల వద్ద గణనాథుడు నిమజ్జనానికి తరలివచ్చిన మహిళలు



రెంటచింతలలో గణనాథుడు నిమజ్జనానికి మేళతాళాలతో తరలివెళ్తున్న యువత



రెంటచింతల ఆనంద్‌పేట కాలనీలో ఏర్పాటు చేసిన అతిపెద్ద గణనాథుడు



ఆకురాజు పల్లెలో జరిగిన నిమజ్జనంలో పాల్గొన్న మహిళలు, చిన్నారులు



కామేపల్లిలో ప్రత్యేక పూజలు అందుకుంటున్న వినాయకుడు

విజయపురి సౌత్: వినాయక చవితి వేడుకలలను వాడవాడలా ఘనంగా నిర్వహించారు. స్థానిక మెయిన్ బజార్, శ్రీ సీతారామ ఆలయం, సాగర్ క్యాంపు, డౌన్ మార్కెట్, ఏపీ జెన్కో క్వాటర్స్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు దేవాలయాల్లో అర్చకులు గుడిపూడి బ్రహ్మాచార్యులు, ప్రశాంత్ శర్మ,హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు. స్థానిక సీ టైపులోని విగ్రహాన్ని గురువారం కుడి కాలువలో నిమజ్జనం చేశారు. విజయపురిసౌత్ కుడి కాలువ, తాళ్లపల్లి బ్రిడ్జి వద్ద ఎస్ఐ.అశోక్ ఆధ్వర్యంలో సిబ్బంది నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రెంటచింతలలో..

మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం నిమజ్జన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో 85 గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేశారు. పలుచోట్ల నిమజ్జనాలను సందడిగా నిర్వహించారు. విగ్రహాలను గ్రామ పుర వీధుల్లో మేళతాలతో ఊరేగించారు. అనంతరం సత్రశాల వద్ద కృష్ణానదిలో, కంభంపాడు గ్రామ సమీపంలో ఉన్న కాలువలో నిమజ్జనం చేసేందుకు తరలివెళ్లారు. స్థానిక స్టేట్‌బ్యాంక్ వద్ద బీజేపీ యువ మోర్చా నాయకులు ఇగుటూరి రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలో యువత చేపట్టిన గణనాథుడి నిమజ్జనం యాత్ర భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డి విగ్రహాల నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు చేశారు. కృష్ణానది వద్ద లైట్లు, పడవలతో పాటు గజ ఈతగాళ్లను ఏర్పాటుచేశారు. ప్రస్తుతం కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తున్నందున సాయంత్రం 6 గంటల వరకే నిమజ్జనం చేయడానికి అనుమతి ఉందని ఆయన తెలిపారు మద్యం తాగి నది వద్దకు విగ్రహంతో ఎవరూ రావద్దని ఆయన హెచ్చరించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.

- స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద చైర్మన్ కట్టమూరి వెంకట నాగేశ్వరరావు నేతృత్వంలో పూజలు నిర్వహించారు.
- స్థానిక ఆనంద్ పేట కాలనీలో ఏర్పాటు చేసిన అతిపెద్ద గణేష్ విగ్రహం, స్టేట్‌బ్యాంక్ వద్ద, ఆటో, ట్రాలీ యూనియన్ వారు బస్‌స్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.
- ఆనంద్‌పేట కాలనీలో వినాయకుని విగ్రహం వద్ద తెనాలి రామకృష్ణ నేతృత్వంలో చిన్నారులు, మహిళలు ప్రదర్శించిన కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

మాచవరంలో..

మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని పలు వీధుల్లో ప్రత్యేక మండపాలలో గణనాథుని విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. ఉత్సవ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. పలు గ్రామాల్లో అన్నదానాలు ఏర్పాటు చేశారు. స్వామి వారి లడ్డూలకు వేలంపాటలు నిర్వహించారు. అనంతరం తీన్మార్ డప్పులు, డీజేలతో గ్రామ పురవీధుల్లో స్వామివారి విగ్రహాలను ఊరేగించారు. అనంతరం గోవిందాపురం బల్లకట్టు వద్ద కృష్ణ నదిలో నిమజ్జనం చేశారు.

పిడుగురాళ్ల రూరల్‌లో..

కామేపల్లిలోని శివాలయం సెంటర్లో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడిని సందడిగా గురువారం నిమజ్జనానికి తరలించారు. తీన్మార్ డప్పులు, బాణసంచా మోతల మధ్య చిన్నారులు, యువత, మహిళలు కలిసి విఘ్నేశ్వరుని నిమజ్జనానికి తరలించారు. కామేపల్లి గ్రామంలోని చౌడమ్మదేవి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని డీజే సౌండ్లు, తీన్మార్ డప్పులతో, వైభవంగా నిమజ్జనానికి తరలించారు. ఆకరాజు పల్లి మేజర్ వద్ద విగ్రహాలను నిమజ్జనం చేశారు

- మండలంలోని కామేపల్లి, బ్రాహ్మణపల్లి, కోనంకి, తుమ్మలచెరువు, పందిటివారిపాలెం, గుత్తికొండ, పెద్ద అగ్రహారం, చిన్న అగ్రహారం, కరాలపాడు, తదితర గ్రామాల్లో గురువారం గణనాథుడికి విశేష పూజలు చేశారు..
- బ్రాహ్మణపల్లిలో చర్చి బజార్ వద్ద ఏర్పాటు చేసిన మండపంలో విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు.

దాచేపల్లిలో..

మండల వ్యాప్తంగా వినాయక చవితి పండుగ వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. తొలుత పలు దేవాలయాల్లో భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేకంగా పూజలు చేశారు. దాచేపల్లి నగర పంచాయతీతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో భారీగా వినాయకుని విగ్రహాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాలలో అలంకరణ చేశారు. నారాయణపురం లోని రెడ్ల బజారులో ఏర్పాటుచేసిన విగ్రహం వద్ద కమిటీ సభ్యులు మందపాటి రమేష్ రెడ్డి, బుర్రా విజయ కుమార్ రెడ్డి, గొట్టం అంజిరెడ్డి, గోవిందరెడ్డి, మల్లారెడ్డి, సమర సింహారెడ్డి తదితరులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. పలు వినాయకుని విగ్రహాల వద్ద సాంస్కృతి కార్యక్రమాలను ప్రదర్శించారు.

కారెంపూడిలో..

మండలంలోని వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రతి ఇంట్లో పత్రితో పూజ చేసి గురువారం సాగర్ కాల్వలలో నిమజ్జనం చేశారు. అన్ని గ్రామాల ప్రధాన కూడళ్లలో భారీ గణేష్ విగ్రహాలను మండపాలలో ఏర్పాటు చేసి సామూహిక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అంకాలమ్మ గుడి సెంటర్, గాంధీ బొమ్మ సెంటర్, ఇందిరా నగర్ కాలనీ సెంటర్.. ఇలా వాడవాడలా విగ్రహాలను భక్తులు ఏర్పాటు చేసి పూజలు కొనసాగిస్తున్నారు. గడప గడపకు ప్రసాదాలను పంపిణీ చేస్తున్నారు.

మాచర్లలో..

పట్టణంలో వినాయక చవితి ఘనంగా నిర్వహించారు. పట్టణంలో 31 వార్డుల్లో 40 విగ్రహాలు ఏర్పాటు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద మాజీ మున్సిపల్ చైర్మన్ పోలిశెట్టి శ్రీనివాసరావు, కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీడబ్ల్యూ కాలనీలో లెనిన్ ఆధ్వర్యంలో యనుమల కేశవరెడ్డి పూజలు నిర్వహించారు. రామా టాకీస్ లైనులో చిన్న వినాయకుడికి మహిళలు ప్రత్యేక పూజలు జరిపారు. కృష్ణవేణి ఆధ్వర్యంలో వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వెల్దుర్తిలో..

మండలంలోని పలు గ్రామాలల్లో వినాయక చవితి వేడుకలను బుధవారం ఘనంగా జరిగాయి. పలుచోట్ల 120కి పైగా మండపాలను ఏర్పాటు చేసి వేడుకలను నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ ప్రత్యేక పూజలు, స్వామికి అలంకరణలు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. దంపతులతో నిత్యం పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆలయాల వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

విఘ్నేశ్వరుని ఆశీస్సులు అందరికీ ఉండాలి

మాచర్ల రూరల్: తెలుగు వారు ఏ పని మొదలు పెట్టాలన్నా మొదటగా విఘ్నేశ్వరుని పూజతోనే ప్రారంభిస్తారని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతురెడ్డి కోటిరెడ్డి తెలిపారు. పట్టణం, మండలంలోని పలు వినాయకుని విగ్రహాల మండపాలలో గురువారం పూజలు నిర్వహించి ఆయన మాట్లాడారు. గణేషుని విగ్రహాలు భక్తిశ్రద్ధలతో ఏర్పాటు చేసుకోవటం శుభపరిణామమని పేర్కొన్నారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలంతా బాగుండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వడ్డెంగుంట శివ,హనిమిరెడ్డి, కొండలు, చిన్నా, శివారెడ్డి పాల్గొన్నారు.

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి



రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే కాసు



బీసీ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద పూజలు

పిడుగురాళ్ల: గురజాల నియోజకవర్గంలోని ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆకాంక్షించారు. పట్టణంలోని లెనిన్‌నగర్, చంద్రపాలెం, మారుతీనగర్, సినిమా హాల్ సెంటర్‌లో కొండవీటి రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో గురువారం ఆయన పాల్గొన్నారు. స్వామికి పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ పాడిపంటలు పండి ప్రజలంతా సుఖసంతోషాలతో జీవితం సాగించాలని ఆయన కోరారు. రైతు బాగుంటేనే వ్యాపారాలు సక్రమంగా జరుగుతాయన్నారు. అందుకే రైతు బాగుండాలని ప్రతి ఒక్కరు కోరుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో విగ్రహ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కారంపూడి ఇందిరానగర్ కాలనీ సెంటర్‌లో పూజలు చేస్తున్న భక్తులు



మాచర్లలో జరిగిన పూజల్లో మాజీ మున్సిపల్ చైర్మన్ పోలిశెట్టి శ్రీనివాసరావు



మాచర్లలోని నెహ్రూనగర్‌లో అన్నదానం



మాచర్ల పీడబ్ల్యూ కాలనీలో యూత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

విద్యుత్ ఉద్యమ అమరవీరులకు ఘన నివాళులు



నివాళులర్పిస్తున్న నాయకులు

పిడుగురాళ్ల: బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమ అమరవీరుల స్ఫూర్తితో మరో ఉద్యమం చేయాలని సీపీఐ గురజాల నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి పిలుపునిచ్చారు. పిడుగురాళ్ల పట్టణంలోని ఎస్‌టీయూ కార్యాలయంలో గురువారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యమంలో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వాములకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్లపై టీడీపీ వామపక్ష పార్టీలతో కలసి పోరాటాలు చేసిందని తెలిపారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దాన్ని పక్కన పెట్టి స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తోందని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా ప్రజలంతా ఉద్యమంలోకి రావాలని పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్ల వల్ల పేదలు, చిరు వ్యాపారులు, చిన్న పరిశ్రమల నిర్వాహకులు ఎన్నో ఇబ్బందులకు గురవుతారని తెలిపారు. సీపీఎం నాయకులు తెలకపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ సర్దుబాటు చార్జీలతో ప్రజలపై రూ. 15 వేల కోట్ల భారం మోపారని, దీన్ని ప్రభుత్వమే భరించాలని ఆయన కోరారు. అదానీతో కుదిరిన విద్యుత్ ఒప్పందం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ పిడుగురాళ్ల మండల కార్యదర్శి అక్కినపల్లి బాలయ్య, పార్టీ సీనియర్ నాయకులు షేక్ కరిముల్లా, సీపీఎం నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు, దేవళ్ల భూలక్ష్మి, ఎస్. వెంకటకృష్ణ, బి. కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



మొక్కలు నాటుతున్న రోటరీ క్లబ్ సభ్యులు

మాచర్ల: పర్యావరణ పరిరక్షణలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం వంద మొక్కలు నాటారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ తుమ్మల ప్రసాద్, కార్యదర్శి ఆలేటి కోటేశ్వరరావు, కోశాధికారి యనమదల వెంకట్రామయ్య మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు. ముమ్ముందు మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సేవా దృక్పథంతో ప్రజల సహకారంతో ముందుకు సాగుతామని చెప్పారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు డాక్టర్ రామకోటయ్య, నాగూర్ వలి, సిద్ధం రాజు, రామ్మూర్తి, శంకర్ సత్యనారాయణ, గుండా నాగేశ్వరరావు, పోలూరు శ్రీను, మేడం నాగేశ్వరరావు, తిర్లికా శ్రీనివాసరావు, ఎస్. నరసింహారావు, జె.వి. కె.ఎస్. ప్రసాద్, చెరుకూరి నరసింహారావు, లీలా ప్రసాద్

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

వినాయక చవితి సందర్భంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు తుమ్మల సత్యప్రసాద్ మాట్లాడుతూ కాలుష్యానికి మూలకారణమైన ప్లాస్టర్ ఆఫ్ విగ్రహాలకు స్వస్తి చెప్పాలని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి ఆలేటి కోటేశ్వరరావు, కోశాధికారి వై.వెంకట్రామయ్య, డాక్టర్ రామకోటయ్య, పఠాన్ నాగూర్‌వలి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మాచర్ల: పట్టణంలోని ఎనిమిదో వార్డులో బుధవారం వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బైక్ మెకానిక్ షేక్‌నాగూర్ (36) మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్య గొడవపడి అతడిని వదిలి పుట్టింటికి వెళ్లిపోయింది. నాగూర్ మానసికంగా బాధపడుతూ బుధవారం తన నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు సంతానం ఉన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసరావు

రెంటచింతల: బాల్య విహాలు చట్టరీత్యా నేరమని గురజాల సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక రేకుల మాన్యం కాలనీలో గురువారం జాతీయ, రాష్ట్ర సేవాసంస్థల ఆదేశాల మేరకు గురజాల మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ గంటా ప్రియదర్శిని ఆధ్వర్యంలో బాల్య వివాహాలు...ముందస్తు గర్భధారణ దుష్ప్రభావాలపై అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చిన్న వయస్సులో పిల్లలకు పెళ్లిళ్లు చేయకుండా వారిని చదివించి, మంచి భవిష్యత్‌ను ఇవ్వాలని ఆయన సూచించారు. బాల్య వివాహం, పోక్సో చట్టాల గురించి వివరించారు. స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి మాట్లాడుతూ చిన్న వయస్సులో గర్భధారణ వల్ల తల్లులకు రక్తహీనత కలుగుతుందని తెలిపారు. పిల్లలు కూడా శారీరక, మానసిక వైకల్యాలతో పుట్టే అవకాశం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోటా శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ కె.చలమరాజు, ఎంఈవో–2 వై.శివనాగేశ్వరావు, ప్యానెల్ లాయర్ జానీ బాషా, సీడీపీవో సూపర్‌వైజర్ జ్యోతి, న్యాయవాదులు కలివేళ ప్రభుదాసు, మణిదీప్, అనీల్ కుమార్, కనకరాజు, వైద్య, పోలీసు శాఖల సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

విగ్రహాల నిమజ్జనంలో అప్రమత్తత అవసరం

కారెంపూడి: సాగర్ కుడి కాల్వలో గణేష్ విగ్రహాలను నిమజ్జనంలో ఉత్సవ నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని కారెంపూడి సీఐ టీవీ శ్రీనివాసరావు, ఎస్ఐ వాసు సూచించారు. విగ్రహాల నిమజ్జన సమయంలో ప్రమాదాలు జరగకుండా వినుకొండ రోడ్డులోని సాగర్ కాల్వ బ్రిడ్జిపై పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. సిబ్బందితో బందోబస్తు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చిన్న పిల్లలను నిమజ్జన ప్రదేశానికి అనుమతించవద్దని తెలిపారు. రక్షణ చర్యలు తీసుకుని, ప్రమాదాలకు తావు లేకుండా నిమజ్జనాలు కొనసాగించాలని సూచించారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

మాచర్ల రూరల్: పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి సంగం డెయిరీ కృషి చేస్తుందని డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని గన్నవరంలో గురువారం పాడి రైతులకు బోనస్ పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. పాడి రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు లీటర్‌కు అదనంగా బోనస్ కింద రూ. 6.50 పంపిణీ చేస్తున్నామని తెలిపారు.పశువులకు దాణా కట్టలు, గడ్డి విత్తనాలు, బలం మందులు సబ్సిడీపై అందజేస్తున్నామని చెప్పారు.